




# నేటి దిక్సూచి

www.netidiksuchi.com

తెలుగు దినపత్రిక

TGTEL/25/A3190








ప్రచురణ. రంగారెడ్డి, సంపుటి:01 సంచిక :138 ఎడిటర్ పి. అలివేలు పేజీలు : 04, వెల. 2రూ/ ఆదివారం- 13 - సెప్టెంబర్ - 2026


## బ్రిక్స్ కూటమి ఏ దేశానికి
# వ్యతిరేకం కాదు

- దిల్లీలో ప్రారంభమైన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు
- అతిథులు అందరికీ స్వాగతం పలికిన ప్రధాని మోదీ




ఢిలి: బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు 2026ను భారత ప్రధాని నరేంద్ర మోదీ శనివారం అధికారికంగా ప్రారంభించారు. సందర్భంగా మోదీ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ సమస్యల పరిష్కారం దిశగా బాధ్యతలు తీసుకునేందుకు భారత్ సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. బ్రిక్స్ కూటమి ఏ దేశానికి వ్యతిరేకం కాదని ప్రధాని ఉద్ఘాటించారు. మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా గ్లోబల్ గవర్నెన్స్ మెరుగుపరచడానికి 10 సూత్రాలతో కూడిన ఒక సమగ్ర రోడ్‌మ్యాప్‌ను ప్రధాని మోదీ ప్రతిపాదించారు. "మీ అందరికీ స్వాగతం పలకడం నాకు ఎంతో సంతోషాన్ని ఇస్తోంది. భారతదేశ బ్రిక్స్ అధ్యక్షత అనేది ప్రజల కేంద్రంగా, మానవత్వమే మొదటి ప్రాధాన్యత అనే విధానంపై ఆధారపడి ఉంది. స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత మా ప్రధాన్యతలు. వీటితోపాటు బ్రిక్స్ సహకారాన్ని సామాన్య ప్రజలతో అనుసంధానించడంపై మేము ప్రత్యేకంగా దృష్టి సారించాం. ఈ దార్శనికతను దృష్టిలో ఉంచుకొని, 350కిపైగా సమావేశాలు నిర్వహించాం. మిగతా..2లో

## రూ.253 కోట్లతో అమరావతిలో
## దేశంలోనే అతిపెద్ద ఫోరెన్సిక్ ల్యాబ్: ఏపీ డీజీపీ




- నేర పరిశోధనకు ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీలు వెన్నెముక లాంటివన్న డీజీపీ హరీశ్ గుప్తా
- పలు కేంద్రాల్లో ల్యాబ్‌లను ఆధునీకరిస్తున్నామని వెల్లడి
- కీలకమైన కేసుల్లో 13 గంటల్లోనే నివేదికలు అందిస్తున్నామన్న డీజీపీ

## దిల్లీ డిక్లరేషన్‌ను
# ఆమోదించిన బ్రిక్స్ సదస్సు

- బ్రిక్స్ దిల్లీ డిక్లరేషన్‌ను ప్రకటించిన ప్రధాని మోదీ
- విభేదాలు పక్కనపెట్టి దిల్లీ డిక్లరేషన్‌కు ఆమోదం తెలిపిన అరబ్ దేశాలు



ఢిల్లీ : సభ్యదేశాల ఆమోదంతో బ్రిక్స్ దిల్లీ డిక్లరేషన్‌ను శనివారం ప్రధాని మోదీ స్వయంగా ప్రకటించారు. భారత్ దైత్యం ఫలితంగా, విభేదాలు పక్కనపెట్టి దిల్లీ డిక్లరేషన్‌కు అరబ్ దేశాలైన ఇరాన్ , యూఏఈ, సౌదీ అరేబియా ఆమోదం తెలిపడం విశేషం. ఈ ప్రకటనకు ముందు జరిగిన చర్చలు చివరి నిమిషం వరకు ఉత్కంఠభరితంగా సాగాయి. ఎందుకంటే ప్రారంభంలో ఇరాన్ , యూఏఈలు కఠిన వైఖరి అవలంభించాయి. బ్రిక్స్ అనేది పూర్తిగా ఏకాభిప్రాయంతో నడిచే కూటమి, కనుక ఏ ఒక్క సభ్యదేశం వ్యతిరేకించినా సరే ఉమ్మడి ప్రకటన నిలిచిపోతుంది. ఇలాంటి తరుణంలో భారత్ అద్భుతమైన దౌత్య విజయం సాధించింది. శనివారం జరిగిన బ్రిక్స్ కూటమి సమావేశంలో సభ్యదేశాలన్నీ ఏకాభిప్రాయంతో ఒక జాయింట్ డిక్లరేషన్ ను ఆమోదించాయి. పశ్చిమాసియా సంక్షోభం విషయంలో ఇరాన్ , యూఏఈ, సౌదీ అరేబియా మధ్య తీవ్రమైన విభేదాలు ఉన్నప్పటికీ, తెరవెనుక జరిగిన వరుస చర్చల ఫలితంగా ఈ ప్రతిష్టంభనకు తెరపడింది. దీనితో ప్రధాని నరేంద్ర మోదీ శనివారం మిగతా..2లో

## ఆదిలాబాద్ విమానాశ్రయ పనులు
# వేగవంతమయ్యాయి




- రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడుతో భేటీ అయిన కిషన్ రెడ్డి
- ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుకు రక్షణశాఖ సమ్మతి తెలిపిందని వెల్లడి
- డీపీఆర్, మాస్టర్ ప్లాన్ ప్రక్రియ త్వరగా ముగించాలని నిర్ణయించామన్న కేంద్ర మంత్రి

హైదరాబాద్ : ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన ఆదిలాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టు పనులు వేగవంతం అయ్యాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా కీలకమైన ఈ ప్రాజెక్టు పురోగతిపై ఈరో ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర

## అన్ని సౌకర్యాలు అందిస్తాం,
# భక్తితో గణనాథుడిని పూజిద్దాం

- గణేశ్ మండప నిర్వాహకులతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ
- అసెంబ్లీ ఆవరణలోని శాసన మండలి కాన్ఫరెన్స్ హాల్‌లో గణేశ్ ఉత్సవ ఏర్పాట్లపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష జరిపారు.
- ఈ రివ్యూకు మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ , ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు హాజరయ్యారు.




హైదరాబాద్: గణేశ్ ఉత్సవాలు ముగిసే వరకు మున్సిపల్, పోలీస్ శాఖ నిరంతర పర్యవేక్షణ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అసెంబ్లీ ఆవరణలోని శాసనమండలి కాన్ఫరెన్స్ హాల్‌లో హైదరాబాద్ లో గణేశ్ ఉత్సవ ఏర్పాట్లపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం రేవంత్ పలు కీలక సూచనలు చేశారు. గణేశ్ ఉత్సవాల పర్యవేక్షణ, సమన్వయానికి ప్రత్యేక అధికారులను నియమించాలని ఆదేశించారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా జాగ్రత వహించాలని సూచించారు. ఇందుకు నిర్వాహకుల నుంచి సహకారం ఉండాలన్నారు. హైదరాబాద్ ప్రశాంతంగా ఉంటేనే పెట్టుబడులు వస్తాయని అన్నారు. సమస్యలు ఏమున్నా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

దరఖాస్తు చేసుకుని ఉచిత విద్యుత్ పొందాలి

దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మండప నిర్వాహకులు సంబంధిత అధికారుల వద్ద దరఖాస్తు చేసుకుని ఉచిత విద్యుత్ పొందాలని సూచించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత సంప్రదాయాన్ని పునరుద్ధరించామన్నారు. సమస్యలు తెలుసుకునేందుకు స్వయంగా తానే సమీక్ష నిర్వహిస్తున్నామన్నారు. మండపాలకు అతిథులను ఆహ్వానిస్తే నిర్వాహకులు ఆ వివరాలు స్థానిక కమిషనరేట్ కు అందించాలని సూచించారు. మిగతా..2లో

## నిషేధిత భూముల జాబితా
## కొత్తగా వచ్చింది కాదు, గతంలో ఉన్నదే

- ధరణి పోర్టల్ అడ్డుపెట్టుకుని గత పాలకులు వేలాది ఎకరాలు చెరబట్టారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు.
- 22ఏపై అసెంబ్లీలో స్వల్పకాలిక చర్చ సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పై తీవ్ర విమర్శలు గుప్పించారు.



హైదరాబాద్: నిషేధిత భూముల జాబితా కొత్తగా వచ్చింది కాదని, గతంలో ఉన్నదేనని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ భూములను బలమున్నవాడు కొల్లగొట్టకుండా తెచ్చిన చట్టమని వివరించారు. 22ఏ నిషేధిత జాబితా భూముల అంశంపై అసెంబ్లీలో స్వల్పకాలిక చర్చ సందర్భంగా మంత్రి పొంగులేటి సుదీర్ఘంగా మాట్లాడారు. 1995లో ఘట్కేసర్ రైల్వేస్టేషన్ భూమిని కూడా ఒకరికి రిజిస్ట్రేషన్ చేశారన్న మంత్రి పొంగులేటి, అలాంటి అక్రమాలు మళ్లీ జరగొద్దనే నిషేధిత భూముల జాబితా తెచ్చారన్నారు. మళ్లీ కేసీఆర్ హయంలో 2016లో కొత్తగా జీవో 121 జారీ చేశారని చెప్పారు. జీవో 121 తీసుకువచ్చి చాలామంది రైతులను నిషేధిత జాబితాలో చేర్చారని ఆరోపించారు. తమ ప్రభుత్వం కొత్తగా నిషేధిత జాబితాలో ఒక్క ఎకరమూ చేర్చలేదని శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల మిగతా..2లో

## డీఎస్సీపై ఫేక్ ప్రచారం - పెద్ద అప్పలరాజు ఉద్యోగంపై లోకేశ్ క్లారిటీ



డీఎస్సీ నియామకాల్లో ప్రభుత్వం అర్హతకు పెద్దపీట వేసిందని లోకేశ్ తెలిపారు.

నేషనల్ ఛాంపియన్‌గా నిలిచిన బాక్సర్ పెద్ద అప్పలరాజుకు డీఎస్సీలో టీచర్ ఉద్యోగం లభించడాన్ని వక్రీకరిస్తూ గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు.

ఢిల్లీ : మెగా డీఎస్సీ-2025 నియామకంపై వైఎస్సార్సీపీ బురద జల్లుతూనే ఉంది. అయితే ఈ రిక్రూట్‌మెంట్ లో అవకతవకలు జరిగాయని అర్హత లేనివారికి ఉద్యోగాలు కట్టబెట్టారని ఆరోపణలు గుప్పిస్తోంది. దీనిపై ఇటు అధికారులు, అటు సర్కార్ కౌంటర్ ఇస్తూనే ఉంది. ఈ క్రమంలోనే డీఎస్సీ నియామకాల్లో కూటమి ప్రభుత్వం అర్హతకు పెద్దపీట వేసిందని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. కానీ వైఎస్సార్సీపీ మాత్రం ఫేక్ ప్రచారంతో క్రీడాకారులను అవమానిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేషనల్ ఛాంపియన్‌గా నిలిచిన ఆంధ్రప్రదేశ్ గర్వించదగ్గ బాక్సర్ పెద్ద అప్పలరాజుకు మిగతా..2లో

## తెలంగాణలో ఆగని వానలు.. మరో వారం పాటు వర్ష సూచన



- తెలంగాణలో మరో వారం పాటు వర్షాలు కొనసాగింపు
- రానున్న 24 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్ష సూచన
- ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో కుండపోత వానల అంచనా
- సీజనల్ వ్యాధులపై ప్రజారోగ్య శాఖ ప్రత్యేక హెచ్చరికలు జారీ
- హైదరాబాద్‌లోనూ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం

హైదరాబాద్: తెలంగాణలో వర్షాల ఉద్ధృతి ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపించడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రానున్న 24 గంటల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటూ హెచ్చరికలు జారీ చేసింది. మిగతా..2లో

## దేశంలోనే తొలిసారిగా
## బీసీ రక్షణ చట్టం తీసుకొస్తున్నాం




- బీసీ రక్షణ చట్టం అవగాహన సదస్సులో పాల్గొన్న సవిత
- బీసీలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక గుర్తింపు చంద్రబాబుతోనే సాధ్యమని వ్యాఖ్య
- జగన్ ప్రభుత్వం బీసీలకు ద్రోహం చేసిందని విమర్శ

అమరావతి : బీసీల ఆత్మగౌరవ జీవనమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మంత్రి సవిత స్పష్టం చేశారు. విజయవాడ సమీపంలోన ఉన్న గొల్లపూడి బీసీ భవన్‌లో నిర్వహించిన '

## ఏపీలో భారీ వర్షాలు, వరదలపై ప్రజలను
# అప్రమత్తం చేయండి..
## అధికారులకు పవన్ దిశానిర్దేశం

- రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. సంబంధిత అధికారులను అప్రమత్తం చేశారు.
- రాష్ట్ర వ్యాప్తంగా వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ సూచనలు చేశారు.




## సీఎం చంద్రబాబుతో కేంద్ర మంత్రి
## జేపీ నడ్డా మర్యాదపూర్వక భేటీ

- సీఎం చంద్రబాబుతో కేంద్ర మంత్రి జేపీ నడ్డా సమావేశం
- ఉండవల్లిలోని సీఎం నివాసంలో జరిగిన భేటీ
- మర్యాదపూర్వకంగానే సమావేశమైన ఇరువురు నేతలు
- పలు అభివృద్ధి కార్యక్రమాల కోసం ఏపీకి వచ్చిన నడ్డా



అమరావతి : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. శనివారం ఉదయం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో ఈ సమావేశం జరిగింది. రాష్ట్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు అమరావతికి విచ్చేసిన కేంద్ర మంత్రి నడ్డాను సీఎం చంద్రబాబు తన నివాసానికి ఆహ్వానించారు. సీఎం నివాసానికి చేరుకున్న జేపీ నడ్డాకు చంద్రబాబు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఇరువురు నేతలు కొద్దిసేపు ముచ్చటించారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై సాధారణంగా చర్చించుకున్నట్లు తెలుస్తోంది. మిగతా..2లో

## లైఫ్ సర్టిఫికెట్ తప్పనిసరి.. లేదంటే వైద్య సేవలు బంద్

మందమర్రి, : సింగరేణి విశ్రాంత ఉద్యోగులు సిపిఆర్ఎంఎస్ - ఎన్ ఈ వైద్య సేవలను నిరంతరాయంగా పొందేందుకు ప్రతి ఏడాది నవంబర్‌లో ఆన్‌లైన్ ద్వారా లైఫ్ సర్టిఫికెట్ రెన్యువల్ చేసుకోవాలని మందమర్రి ఏరియా డీజీఎం (పర్సనల్) సీహెచ్. అశోక్ సూచించారు.గత నవంబర్‌లో లైఫ్ సర్టిఫికెట్ సమర్పించకపోవడంతో మందమర్రి ఏరియాకు చెందిన 1,057 మంది విశ్రాంత ఉద్యోగులు ప్రస్తుతం వైద్య సేవలకు దూరమైనట్లు తెలిపారు. ఇప్పటివరకు సర్టిఫికెట్ సమర్పించని వారు, సాంకేతిక కారణాలతో ప్రక్రియ పూర్తికాని వారు వెంటనే ఆన్‌లైన్‌లో లైఫ్ సర్టిఫికెట్ సమర్పించి వైద్య సేవలను పునరుద్ధరించుకోవచ్చని సూచించారు.సిపిఆర్ఎంఎస్ - ఎన్ ఈ ద్వారా వైద్య సేవలు పొందుతున్న విశ్రాంత ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## మట్టి గణపతితోనే పర్యావరణ పరిరక్షణ

పర్యావరణహితంగా వినాయక చవితి జరుపుకోవాలి: జీఎం రాధాకృష్ణ




మందమర్రి,: వినాయక చవితి వేడుకలను పర్యావరణహితంగా నిర్వహించాలని సింగరేణి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం మందమర్రి ఏరియాలోని సీఈఆర్ క్లబ్‌లో ఉద్యోగులు, ప్రజలకు మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జీఎం మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల జలాశయాలు కలుషితమై జలచరాలకు ముప్పు ఏర్పడుతుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను పూజించాలని సూచించారు. సింగరేణి ఆధ్వర్యంలో మందమర్రి ఏరియాలో వేలాది మొక్కలు నాటామని, అవి నేడు మహావృక్షాలుగా ఎదిగి పట్టణానికి స్వచ్ఛమైన ప్రాణవాయువును అందిస్తున్నాయని పేర్కొన్నారు. వినాయక చవితి ప్రకృతి ఆరాధనకు ప్రతీక అని, వినాయకుడికి సమర్పించే 21 రకాల పత్రి కూడా ప్రకృతి ప్రాధాన్యతను తెలియజేస్తాయని అన్నారు. భక్తిశ్రద్ధలతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ వేడుకలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటుజీఎం జి.ఎల్.ప్రసాద్, శాంతిఖని ఏజెంట్ సంతోష్‌కుమార్, డీజీఎం (పర్సనల్) సీహెచ్.అశోక్, ఏఐటీయూసీ నాయకుడు ఈ.రాజేశ్వరరావు, ఎన్విరాన్‌మెంట్ అధికారి వెంకట్‌రెడ్డి, సీనియర్ పీఓ సత్యనారాయణ, అధికారులు, గుర్తింపు సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు, సిబ్బంది, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

## జె రవీందర్‌కు ఘన నివాళి
## మందమర్రిలో నేడు సంతాప సభ



మందమర్రి : ఇటీవల మృతి చెందిన మందమర్రి పట్టణానికి చెందిన జే. రవీందర్ సంతాప సభ ఆదివారం నిర్వహించనున్నారు. మందమర్రి పట్టణ కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 10 గంటలకు సభ జరగనుంది.తెలంగాణ ఉద్యమంలో రాష్ట్ర జేఏసీ నాయకుడిగా, బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి కీలకంగా పనిచేసిన నాయకుడిగా రవీందర్ రాజకీయ, ప్రజా జీవితంలో కొనసాగారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే.చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సంతాప సభకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ట్రేడ్ యూనియన్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కుల సంఘాల ప్రతినిధులు, పాత్రికేయులు, వివిధ సంఘాల నాయకులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులు హాజరుకానున్నారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు సంక్షిప్త భోజన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## నిరంతర సాధనతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు ; జీఎం ఎం. శ్రీరమేష్




క్రీడల్లో ప్రతిభను వెలికితీసేందుకు నిరంతర సాధన ఎంతో అవసరమని, గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ ముందుకు సాగాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. శ్రీరమేష్ అన్నారు. శనివారం గోలేటిలోని సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించిన డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ 93వ వార్షిక క్రీడా పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. క్రీడలు వివిధ ప్రాంతాలకు చెందిన వ్యక్తుల మధ్య స్నేహభావాన్ని పెంపొందించడంతో పాటు ఆరోగ్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు పొందే అవకాశాలు ఉన్నందున ఉద్యోగులు తమ పిల్లలను వివిధ క్రీడల్లో ప్రోత్సహించి శిక్షణ ఇప్పించాలని సూచించారు. అనంతరం డిపార్ట్‌మెంటల్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్. తిరుపతి, సీఐఎంఓఏఐ కార్యదర్శి, ఏరియా ఇంజినీర్ వీరన్న, ఎస్ఓ టు జీఎం కె. రాజమల్లు, పర్సనల్ విభాగం ఇన్‌చార్జి హెచ్‌ఓడీ ఎం. శ్రీనివాస్, డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ గౌరవ కార్యదర్శి డి. ప్రశాంత్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కిరణ్‌బాబు, జనరల్ కెప్టెన్ ఎస్‌కే. అబ్బాస్‌తో పాటు క్రీడాకారులు పాల్గొన్నారు.

## మట్టి గణపతుల పంపిణీ



రెబ్బెన సెప్టెంబర్ 12 : భావితరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందించాలంటే పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. శ్రీరమేష్ అన్నారు. శనివారం వినాయక చవితిని పురస్కరించుకుని గోలేటి డిస్పెన్సరీ సమీపంలో ప్రజలకు ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. ప్రకృతితో మమేకమై జీవిస్తే సకల జీవరాశులకు ఆరోగ్యకరమైన మనుగడ ఉంటుందన్నారు. భావితరాలు స్వచ్ఛమైన ప్రకృతిని ఆస్వాదించాలంటే ప్రస్తుత తరం పంచభూతాలను కాలుష్యం నుంచి కాపాడుకోవాలని సూచించారు. జలవనరులు కలుషితం కాకుండా ఉండేందుకు ప్రతి కాలనీలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు మారం శ్రీనివాస్, సీఐఎంఓఏఐ అధ్యక్షుడు, ఖైరిగుర పీఓ ఎం. నరేందర్, ఎస్ఓ టు జీఎం కె. రాజమల్లు, ఏరియా ఇంజినీర్ వీరన్న, ఏరియా సేఫ్టీ అధికారి స్వామిరాజు, డీజీఎం (ఐఈ) ఉజ్వల్‌కుమార్ బెహరా, పర్సనల్ విభాగం ఇన్‌చార్జి హెచ్‌ఓడీ ఎం. శ్రీనివాస్, సీనియర్ పీఓ డి. ప్రశాంత్, ఇన్‌చార్జి ఎన్విరాన్‌మెంట్ అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు..



నిర్మల్, **సెప్టెంబర్ 12:** నిర్మల్ జిల్లా, ఖానాపూర్, మండలంలోని సోమార్పేట్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త కొడారి రాజన్న ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జంగిలి శంకర్‌తో పాటు పలువురు నాయకులు శనివారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రాజన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిసిసి కార్యదర్శి అంకం రాజేందర్ సర్పంచుల మండల ఫోరం అధ్యక్షులు రాజు నాయక్ తర్లపడ్ సర్పంచ్ పొలంపెల్లి సచిన్, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు బిక్కు నాయక్ ప్రధాన కార్యదర్శి కొడిమ్యాల వీరేష్ ఉప సర్పంచ్ సార్ల నరసయ్య పిఏసిఎస్ డైరెక్టర్ గాజుల గంగన్న గ్రామ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిని మింగుతున్న గురునానక్ కళాశాల..!

- ఐదెకరాల భూమిపై ఆక్రమణ ఆరోపణలు.. అధికారుల బోర్డులు మాయం!
- సెలవుల వేళ మళ్లీ నిర్మాణ పనులు? ఉన్నతాధికారుల విచారణకు స్థానికుల డిమాండ్..






రంగారెడ్డి /నేటి దిక్సూచి : ప్రభుత్వ భూమిపై ఆక్రమణ ఆరోపణలు మరోసారి తెరపైకి వచ్చాయి. గురునానక్ కళాశాల యాజమాన్యం సుమారు ఐదెకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతోందనే ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. గతంలో ఇదే అంశంపై పత్రికల్లో కథనాలు వెలువడటంతో రెవెన్యూ అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని గుర్తిస్తూ చర్యలు చేపట్టినప్పటికీ, తాజాగా అదే ప్రాంతంలో మళ్లీ నిర్మాణ పనులు జరుగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తడం అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది.

### బోర్డులు ఏర్పాటు చేసినా.. మరుసటి రోజే మాయం

గతంలో ప్రభుత్వ భూమి ఆక్రమణపై వచ్చిన ఫిర్యాదులు, వార్తా కథనాల నేపథ్యంలో రెవెన్యూ అధికారులు స్పందించినట్లు స్థానికులు చెబుతున్నారు. తహసీల్దార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ పుష్పలత ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు మధ్య సంబంధిత స్థలంలో 'ఇది ప్రభుత్వ భూమి' అని సూచించే బోర్డులను ఏర్పాటు చేసినట్లు సమాచారం. అయితే అధికారులు బోర్డులు ఏర్పాటు చేసిన మరుసటి రోజే అవి అక్కడ కనిపించకుండా పోవడం పలు అనుమానాలకు తావిచ్చిందని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ భూమిని గుర్తిస్తూ అధికారులు ఏర్పాటు చేసిన సూచిక బోర్డులే తొలగిపోవడంపై అప్పట్లోనే అనేక ప్రశ్నలు తలెత్తాయి. బోర్డులను ఎవరు తొలగించారు? వాటిని తొలగించడానికి అనుమతి ఎవరిచ్చారు? ప్రభుత్వ భూమిని రక్షించేందుకు ఏర్పాటు చేసిన బోర్డులు తొలగిపోయిన విషయం అధికారుల దృష్టికి వచ్చిందా? వచ్చినట్లయితే ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి.

### సెలవుల వేళ మళ్లీ నిర్మాణాలా?

తాజాగా వరుస సెలవులను ఆసరాగా చేసుకుని అదే ప్రభుత్వ భూమిలో మళ్లీ నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూమిపై నిర్మాణాలు చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొంటూ పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ పనులు జరుగుతున్న విషయం తెలిసిన ఓయూ జేఏసీ నాయకుడు జోగు నరేందర్ అక్కడికి చేరుకుని అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. ప్రభుత్వ భూమిలో నిర్మాణ పనులు చేపట్టడాన్ని అడ్డుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ఒకవైపు రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిగా గుర్తిస్తూ బోర్డులు ఏర్పాటు చేయడం, మరోవైపు ఆ బోర్డులు కనిపించకుండా పోవడం, ఆ తర్వాత అదే ప్రాంతంలో నిర్మాణ పనులు జరుగుతున్నాయనే ఆరోపణలు రావడం వెనుక అసలు వాస్తవం ఏమిటన్నది తేలాల్సి ఉంది.

### అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు

ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ యంత్రాంగంపై ఉంటుంది. ఇప్పటికే వివాదంలో ఉన్నట్లు చెబుతున్న భూమిలో తిరిగి నిర్మాణ పనులు జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ భూమి సరిహద్దులను నిర్ధారించి, రెవెన్యూ రికార్డులతో క్షేత్రస్థాయి పరిస్థితులను సరిపోల్చి వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా గతంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ భూమి సూచిక బోర్డులు ఎలా మాయమయ్యాయి? వాటిని ఎవరు తొలగించారు? తొలగించిన వారిపై ఏమైనా చర్యలు తీసుకున్నారా? ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణాలకు సంబంధించి ఏమైనా అనుమతులు ఉన్నాయా? నిర్మాణాలు ప్రభుత్వ భూమిలోనే జరుగుతున్నాయా? అన్న అంశాలపై సమగ్ర విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నారు.

### ఐదెకరాల భూమిపై స్పష్టత ఇవ్వాలి

సుమారు ఐదెకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందన్న ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో ఆ భూమికి సంబంధించిన సర్వే నంబర్లు, విస్తీర్ణం, రెవెన్యూ రికార్డులు, హక్కులు, ప్రస్తుత వినియోగం తదితర వివరాలను అధికారులు బహిరంగంగా వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ భూమి అయితే దాని హద్దులను స్పష్టంగా గుర్తించి రక్షణ చర్యలు చేపట్టాలని, ప్రైవేటు భూమి లేదా కళాశాల యాజమాన్యానికి చట్టబద్ధమైన హక్కులు ఉన్నట్లయితే సంబంధిత పత్రాలను పరిశీలించి ప్రజలకు స్పష్టత ఇవ్వాలని వారు పేర్కొంటున్నారు.

### ఉన్నతాధికారుల విచారణకు డిమాండ్

ఈ వ్యవహారంపై స్థానిక రెవెన్యూ అధికారుల స్థాయిని దాటి ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. గతంలో అధికారులు ఏర్పాటు చేసిన ప్రభుత్వ భూమి బోర్డులు తొలగిపోవడం, అనంతరం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయనే ఆరోపణలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని కోరుతున్నారు.

## తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి రాష్ట్ర బిజెపి డిమాండ్..

బిజెపి రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఎన్. రామచంద్ర రావు పిలుపు..



నిర్మల్, **సెప్టెంబర్ 12:** నిర్మల్ జిల్లా, ఖానాపూర్ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా తెలంగాణ విమోచన దినోత్సవ ఖానాపూర్ ఇన్‌ఛార్జ్ డా. కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ నిజాం రజాకార్ల అరాచకాల నుండి తెలంగాణ ప్రాంతం విముక్తి పొందిన సెప్టెంబర్ 17వ తేదీని ప్రభుత్వం ఎటువంటి ఓటు బ్యాంకు రాజకీయాలు లేకుండా అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవం గా నిర్వహించాలని వీర తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని వారి పోరాట పటిమను భావి తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి బిజెపి నిరంతరం శ్రమిస్తుందని తెలంగాణ సమాజానికి నిజమైన స్వేచ్ఛ, ప్రజాస్వామ్య బద్ధమైన పాలన మరియు సమగ్ర అభివృద్ధి ఒక్క భారతీయ జనతా పార్టీతోనే సాధ్యమని అన్నారు ఈ సమావేశంలో అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్,పట్టణ అధ్యక్షులు కీర్తి మనోజ్ కుమార్, మండల అధ్యక్షులు పుప్పాల ఉపేందర్, జిల్లా కార్యదర్శి మదిర శ్రీనివాస్,బీజేపీ నాయకులు బండిపెల్లి ప్రకాష్,ఎనగందుల నారాయణ,సందుపట్ల శ్రవణ్, ఆసం సాయి కృష్ణ,బత్తుల నారాయణ, అడిదెల మహేష్,గోదాపురం సందీప్, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ మాస ఉత్సవం కార్యక్రమం..



నిర్మల్, సెప్టెంబర్ 12.. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపాలిటీ లోని శాంతినగర్ లో 1వ వార్డు కౌన్సిలర్ గౌర్రె తిరుమల మాట్లాడుతూ పోషక విలువలతో కూడుకున్న పదార్థాలను ప్రదర్శన చేయడం జరిగింది గర్భిణీ బాలింతలు ఒకరోజు తీసుకునే ఆహారంలో పోషక విలువలు కలిగిన ఆహారం ఆకుకూరలు పండ్లు పాలు గుడ్లు తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వారికి వివరించారు. గర్భిణీ మొదలుకొని బిడ్డ పుట్టిన తర్వాత వేయించుకున్న టీకాలు మరియు టీకాలు వేయడం వల్ల బిడ్డ భవిష్యత్తు వ్యాధుల బారిన పడకుండా ఉంటారని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ గౌర్రెతిరుమల గంగాధర్, ఏ ఎన్ ఎం పద్మ ,ఆశ విజయలక్ష్మి అంగన్వాడి టీచర్లు గీతా రాణి ,మౌనిక ,మానస గర్భిణీ బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## అన్ని యూనియన్లను ఆహ్వానించాలి




రెబ్బెన సెప్టెంబర్ 12 : సింగరేణిలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ కాలపరిమితి సెప్టెంబర్ 8వ తేదీతో ముగిసినందున సింగరేణిలో వెంటనే ఎన్నికలు నిర్వహించాలని వారికి కార్మికుల నుండి రికవరీ చేస్తున్న చందా రికవరీలను నిలిపివేయాలని అప్పటివరకు రిజిస్టర్డ్ యూనియన్ల అన్నిటికి సమాన ప్రాతినిధ్యం ఇవ్వాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఆధ్వర్యంలో జనరల్ మేనేజర్ శ్రీరమేష్ వినతి పత్రం శనివారం ఇచ్చారు. ఇట్టి కార్యక్రమంలోబెల్లంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ శ్రీ మల్రాజు శ్రీనివాసరావు, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ధరావత్ మంగీలాల్, సెంట్రల్ కమిటీ సభ్యులు రామగిరి శ్రీనివాస్ ఏరియా కార్యదర్శులు మారిన వెంకటేశ్వర్లు, ఓరం కిరణ్ ఏరియా సీనియర్ నాయకులు కాయిత స్వామి ఆర్గనైజింగ్ కార్యదర్శి సంఘీ ప్రశాంత్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదుల పెట్టెకు తక్షణ స్పందన..

చెన్నూరు పేదల సమస్యలపై ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ప్రత్యేక శ్రద్ధ




చెన్నూరు., సెప్టెంబర్ 12.. ప్రజల సమస్యల పరిష్కారానికి స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి చేపట్టిన నూతన పద్ధతులు క్షేత్రస్థాయిలో సత్ఫలితాలనిస్తున్నాయి. చెన్నూరులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన 'ఫిర్యాదుల పెట్టె' (గ్రీవెన్స్ బాక్స్) ద్వారా అందుతున్న అర్జీలపై ఆయన ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సత్వర పరిష్కారం చూపుతున్నారు. ఇటీవల ఓ నిరుపేద కుటుంబం తమకు నివాసం లేక పడుతున్న ఇబ్బందులను వివరిస్తూ, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ ఫిర్యాదుల పెట్టెలో ఓ వినతిపత్రం వేసింది. ఆ అర్జీని స్వయంగా పరిశీలించిన వివేక్ వెంకటస్వామి వెంటనే స్పందించారు.

### క్షేత్రస్థాయి పరిశీలనకు ఆదేశాలు

బాధితుల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, అర్హత ప్రమాణాల మేరకు తక్షణమే ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

### జవాబుదారీతనం పారదర్శకత:

స్వయంగా ప్రజలు కలవలేని పరిస్థితుల్లో ఉన్నప్పటికీ, ఫిర్యాదుల పెట్టె ద్వారా పంపిన చిన్న లేఖలకు కూడా సమాన ప్రాధాన్యత లభిస్తుండటంతో స్థానిక ప్రజల్లో విశ్వాసం పెరుగుతోంది. నియోజకవర్గంలో అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు దక్కేలా చూడడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, అర్హులెవరూ నష్టపోకుండా పథకాలు అందజేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు నిరంతరం అందుబాటులో ఉంటూ స్పందిస్తుండటంపై స్థానిక ప్రజలు, లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



మంచిర్యాల, సెప్టెంబర్ 12: మంచిర్యాల జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ,ప్రైవేట్ స్కూల్ల టీచర్స్ కు కలెక్టర్ కుమార్ దీపక్ ఘనంగా సన్మానించారు.శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ భవన సముదాయంలో దాదాపు 70మంది టీచర్స్ ను సన్మానించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ టీచర్స్ తమ విధులను సక్రమంగా నిర్వహించడం వల్లనే విద్యార్థులు ఉన్నత స్థానలు అదిరోహిస్తున్నారని తెలిపారు.తెలంగాణలోనే మన జిల్లా ఉన్నంతగా ఉండడానికి ప్రతి ఒక్కరు తమ వంతు ప్రయత్నం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య,వి. రాములు,మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ,జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా మైనారిటీ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి రాజేశ్వరి,కార్పొరేటర్ సుధమల్ల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణహిత వినాయకుడితో విద్యార్థుల సందేశం

మట్టి విగ్రహాలతో పర్యావరణ పరిరక్షణకు పిలుపు



నస్పూర్, సెప్టెంబర్ 12: విద్యానగర్ సీసీసీ నస్పూర్‌లోని శ్రీ కృష్ణవేణి ప్లే అండ్ హై స్కూల్‌లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ పర్యావరణహిత వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు సహజసిద్ధమైన పదార్థాలతో పర్యావరణహిత గణేశుడి విగ్రహాన్ని తయారు చేసి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బత్తిని దేవన్న మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా నీటి కాలుష్యాన్ని కొంతవరకు నివారించవచ్చని తెలిపారు.పండుగలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని "పర్యావరణాన్ని కాపాడుదాం.. ప్రకృతిని ప్రేమిద్దాం" అనే సందేశాన్ని అందించారు.పర్యావరణహిత విగ్రహాల వినియోగం, బాధ్యతాయుతంగా పండుగల నిర్వహణపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పాఠశాల సిబ్బంది తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వినేశ్ ఫొగాట్ కు బిగ్ షాక్
## వరల్డ్  ఛాంపియన్‌షిప్ ట్రయల్స్‌లో నో ఛాన్స్!

వినేశ్ కు భారీ షాకిచ్చిన దిల్లీ హైకోర్టు - ప్రపంచ ఛాంపియన్‌షిప్ ట్రయల్స్‌లో పాల్గొనేలా అనుమతి ఇవ్వాలన్న పిటిషన్ ను తోసిపుచ్చిన న్యాయస్థానం




ఢిల్లీ : భారత రెజ్లర్ వినేశ్ ఫోగాట్‌కు దిల్లీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. 2026 సీనియర్ వరల్డ్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ ట్రయల్స్‌లో పాల్గొనేందుకు అవకాశం ఇవ్వాలంటూ వినేశ్ దాఖలు చేసిన పిటిషన్‌ను దిల్లీ హైకోర్టు కొట్టివేసింది. డబ్ల్యూఎఫ్ ఐ నిర్దేశించిన అర్హత ప్రమాణాలను కేవలం ఒక్కరి కోసం సవరించి అనుమతి ఇవ్వడం అనేది నిబంధనలకు విరుద్ధమని న్యాయస్థానం అభిప్రాయపడింది. ఈ అర్హత ప్రమాణాలు అందరికీ సమానంగా వర్తిస్తాయని కోర్టు తాజా ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈ మేరకు గురువారం జస్టిస్ స్వర్ణ కాంత శర్మ ఆమె అభ్యర్థనను కొట్టివేశారు. దీంతో ఇంటర్నేషనల్ కెరీర్ లో రీ ఎంట్రీ ఇవ్వాలనుకుంటున్న వినేశ్ ఆశలకు గట్టి దెబ్బ తగిలినట్లైంది. ఇదీ జరిగింది2026 సీనియర్ వరల్డ్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ ట్రయల్స్ సెప్టెంబర్ 14న దిల్లీలో జరగనున్నాయి. అయితే ఈ ట్రయల్స్ కు సంబంధించి డబ్ల్యూఎఫ్ ఐ (రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) సెప్టెంబర్ 7న ఒక సర్క్యులర్ జారీ చేసింది. ఇందులో పేర్కొన్న నిబంధనల ప్రకారం, నిర్ణీత టోర్నమెంట్‌లలో పతకాలు సాధించిన వారు, జాతీయ శిక్షణా శిబిరాల్లో పాల్గొన్నవారు, 2026 అండర్-20 వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లకు ఎంపికైన అథ్లెట్లకు మాత్రమే ఈ ట్రయల్స్ లో పాల్గొనే అర్హత ఉంటుంది. అయితే ప్రెగ్నెన్సీ, ప్రసవం, ప్రసవానంతరం కోలుకునే సమయం కారణంగానే తాను కొన్ని ఈవెంట్‌లకు దూరంగా ఉండాల్సి వచ్చిందని ఆమె కోర్టుకు తెలిపింది. దీంతోపాటు డబ్ల్యూఎఫ్ ఐ తనపై జారీ చేసిన 'షోకాజ్ నోటీసు' వల్ల కూడా ఇంకొన్ని ఈవెంట్లలో పాల్గొనలేకపోయినట్లు చెప్పింది. దీంతో ఈ వరల్డ్ సీనియర్ పోటీలకు నేరుగా ఎంపిక చేయాలని కోరడం లేదని, కనీసం ట్రయల్స్‌లో పోటీ పడే అవకాశం కల్పించాలని కోరుతూ వినేశ్ రీసెంట్‌గా కోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. 2026 సెప్టెంబర్ 7 నాటి సర్క్యులర్‌లో డబ్ల్యూఎఫ్ ఐ పేర్కొన్న అర్హత ప్రమాణాలు అందరికీ సమానంగా వర్తిస్తాయని కోర్టు ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈ నిబంధనలు ఒక్కరి కోసం మార్చలేమని పేర్కొంటూ వినేశ్ పిటిషన్ ను కోర్టు తోసిపుచ్చింది. ఈ క్రమంలోనే మే నెలలో జరిగిన ఆసియా క్రీడల ఎంపిక ట్రయల్స్‌లో పాల్గొనేందుకు హైకోర్టు డివిజన్ బెంచ్ ఆమెకు అనుమతినిచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా కోర్టు గుర్తు చేసింది.

## 10వేల రన్స్ చేసినా నేనూ జట్టుకు ఏడాది దూరమయ్యా'- షమీ రీఎంట్రీపై గంగూలీ బిగ్ స్టేట్‌మెంట్

మహ్మద్ షమీ ప్రదర్శనపై మాజీ క్రికెటర్ సౌరభ్ గంగూలీ కీలక వ్యాఖ్యలు

టీమ్ఇండియాలోకి పునరాగమనం, 2027 వన్డే ప్రపంచ కప్‌లో ఆడే అవకాశాలపై కామెంట్స్



ఢిల్లీ : 2025 ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత సీనియర్ పేసర్ మహ్మద్ షమీ టీమ్ఇండియా జెర్సీలో కనిపించలేదు. జట్టు నుంచి అతన్ని తప్పించి ఏడాదిన్నర గడిచింది. ఇదే సమయంలో షమీ దేశవాళీ క్రికెట్‌లో అద్భుతంగా రాణిస్తున్నాడు. తన బౌలింగ్ తో ఆకట్టుకుంటున్నాడు. అయినప్పటికీ జాతీయ జట్టులో అతనికి చోటు మాత్రం దక్కడం లేదు. దీంతో టీమ్ఇండియా అభిమానులు బీసీసీఐ, సెలెక్షన్ కమిటీపై విమర్శలు గుప్పిస్తున్నారు. అయితే రీసెంట్ గా ముగిసిన దులీప్ ట్రోఫీలోనూ ఆకట్టుకున్నాడు. ఈ క్రమంలో జాతీయ జట్టులోకి షమీ పునరాగమనం, 2027 వన్డే ప్రపంచకప్‌లో ఆడే అవకాశాలపై మాజీ క్రికెటర్, మాజీ బీసీసీఐ అధ్యక్షుడు సౌరభ్ గంగూలీ కీలక వ్యాఖ్యలు చేశాడు.

### నాకు కూడా అలాగే జరిగింది!

గతేడాది కాలంగా దేశవాళీ క్రికెట్‌లో షమీ అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తున్నా టీమ్ లోకి రీ ఎంట్రీ ఇవ్వకపోవడంపై గంగూలీ మాట్లాడాడు. తాజాగా జాతీయ మీడియాతో మాట్లాడుతూ, తాను కూడా కెరీర్ లో ఏడాది పాటు జట్టుకు దూరంగా ఉండి తిరిగి రీఎంట్రీ ఇచ్చానని, షమీ కూడా జట్టులో తనకంటూ ఓ స్థానాన్ని తిరిగి సంపాదించుకోగలడని గంగూలీ పేర్కొన్నాడు. "అతను దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణిస్తున్నాడు. 10వేల పరుగులు చేసినప్పటికీ నేను కూడా, కెరీర్ లో ఏడాది పాటు జాతీయ జట్టుకు దూరమయ్యాను. కానీ, చివరికి తిరిగి జట్టులోకి వచ్చాను" అని గంగూలీ పేర్కొన్నాడు.

### షమీని విస్మరించడం లేదు

ప్రపంచకప్‌కు ఇంకా ఏడాది సమయం ఉన్నందున ఈ గ్యాప్ లో ఏమైనా జరగవచ్చని గంగూలీ అన్నాడు. "షమీ నిలకడగా రాణించడానికి ప్రయత్నిస్తున్నాడు. అతన్ని ఎందుకు ఎంపిక చేయడం లేదో స్పష్టంగా తెలియదు. అయితే 2027 వన్డే ప్రపంచ కప్‌లో అతను ఆడతాడా లేదా? అనేది ఇప్పుడే చెప్పడం కష్టం. ఎందుకంటే ఆ టోర్నీకి ఇంకా ఏడాది సమయం ఉంది. షమీ చాలా కాలంగా క్రికెట్ ఆడుతున్నందున అతడిని విస్మరించరని నా అభిప్రాయం" అని గంగూలీ అన్నాడు.

### ఇషాన్ కూడా

కాగా, ఇషాన్ కిషన్ సారథ్యంలోని ఈస్ట్ జోన్ జట్టు 14 ఏళ్ల తర్వాత దులీప్ ట్రోఫీ టైటిల్‌ను గెలుచుకుంది. ఫైనల్‌లో కిషన్ అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి మొత్తం 350 పరుగులు నమోదు చేశాడు. దీంతో టీ20లు, వన్డేల్లో ఎంట్రీ ఇచ్చిన ఇషాన్, టెస్టుల్లోనూ పునరాగమనం చేస్తాడని గంగూలీ ఆశాభావం వ్యక్తం చేశాడు. "నేను ఇషాన్ కిషన్‌తో మాట్లాడాను. అతని ప్రదర్శన అద్భుతంగా ఉంది. ప్రతి యువ ఆటగాడు టెస్టు మ్యాచ్‌లు ఆడాలని కోరుకుంటాడు. అతనికి ఆ అవకాశం లభిస్తుందని ఆశిస్తున్నాను" అని గంగూలీ అన్నాడు. గతంలో విజయ్ హజారే ట్రోఫీ, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీల్లోనూ ఇషాన్ తన ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు.

# బుమ్రా వచ్చేశాడు- వైభవ్‌కు నెట్స్‌లో అసలైన ఛాలెంజ్!

గాయం తర్వాత నెట్స్‌లోకి తిరిగొచ్చిన జస్ప్రీత్ బుమ్రా

వైభవ్ సూర్యవంశీకి యార్కర్లు, గుడ్ లెంగ్త్ బంతులతో ఛాలెంజ్

45 నిమిషాల పాటు వేగంతో బౌలింగ్ చేసిన బుమ్రా

ప్రాక్టీస్‌లో ఇషాన్ కిషన్‌కు మరో టెన్షన్







ఢిల్లీ : అఫ్గానిస్థాన్‌తో టీ20 సిరీస్‌కు ముందు దిల్లీలో టీమ్ఇండియా ప్రాక్టీస్ రెండో రోజుకు చేరింది. కానీ ఆ సెషన్‌లో అందరి ఫోకస్ ఒక చిన్న నెట్ బ్యాటిల్ మీదే పడింది. గాయం నుంచి కోలుకుని జట్టులోకి తిరిగొచ్చిన జస్ప్రీత్ బుమ్రా ఒక వైపు, యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ మరో వైపు నిలిచారు. ఇద్దరూ భారత్ నెట్స్‌లో ఒకరినొకరు ఎదుర్కోవడం ఇదే తొలిసారి. ఐపీఎల్‌లో 15 ఏళ్ల వయసులో బుమ్రా బౌలింగ్‌లో వైభవ్ సిక్స్ కొట్టిన సందర్భం ఉంది. దీంతో శుక్రవారం అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన ఈ నెట్ సెషన్‌లో ఇద్దరి మధ్య పోటీ అసలైన వైబ్స్ తీసుకొచ్చింది.

### ఫీల్డింగ్‌తో మొదలైన సెషన్

దులీప్ ట్రోఫీ ముగించుకుని ఇషాన్ కిషన్, వైభవ్ సూర్యవంశీ, తిలక్ వర్మ జట్టుతో చేరడంతో ఈ సెషన్‌కు దాదాపు పూర్తి స్క్వాడ్ అందుబాటులోకి వచ్చింది. తేలికపాటి జల్లుల కారణంగా మొదట మైదానంపై కవర్లు ఉన్నా, వర్షం తగ్గిన తర్వాత ఆటగాళ్లు బయటకు వచ్చారు. కొత్త ఫీల్డింగ్ కోచ్ సుభదీప్ ఘోష్ మొదటి అరగంట పాటు డైరెక్ట్ హిట్ డ్రిల్స్ చేయించాడు. ఆటగాళ్లను రెండు గ్రూపులుగా విడగొట్టి స్టంప్స్‌ను టార్గెట్ చేయించాడు. తర్వాత హై క్యాచింగ్ ప్రాక్టీస్ జరిగింది. ఈ సమయంలో వైభవ్ కొన్ని కష్టమైన క్యాచులను వదిలేశాడు. బౌండరీ దగ్గర క్యాచ్ కోసం ముందే సరైన యాంగిల్ తీసుకోవాలని ఘోష్ ఆటగాళ్లకు సూచనలు ఇచ్చాడు.

### 45 నిమిషాలు పూర్తి స్పీడ్‌తో

బుమ్రా తన రన్‌అప్‌ను మార్క్ చేసుకుని అర్ష్‌దీప్ సింగ్, ఫిట్ అయిన నితీశ్ కుమార్ రెడ్డిలతో కలిసి బౌలింగ్ మొదలుపెట్టాడు. శివమ్ దూబేతో పాటు హర్షిత్ రాణాకు కవర్‌గా వచ్చిన యశ్ ఠాకూర్ కూడా బౌలింగ్ చేశాడు. బుమ్రా చాలా కాలం రిహాబ్ తర్వాత వచ్చినప్పటికీ దాదాపు 45 నిమిషాల పాటు పూర్తి ఇంటెన్సిటీతో బౌలింగ్ చేశారు. జూలైలో ఇంగ్లండ్ టూర్ సమయంలో బుమ్రాకు మోకాలి గాయం అయింది. ఆ గాయం కారణంగా ఒక వన్డేకు దూరమయ్యాడు. తర్వాత శ్రీలంకతో జరిగిన టెస్ట్ సిరీస్‌ను కూడా మిస్ అయ్యాడు. ఆ గ్యాప్ తర్వాత టీమ్ఇండియా నెట్స్‌లో తిరిగి బంతి అందుకున్న తొలి రోజే పెద్ద స్పెల్ వేశాడు. రన్‌అప్ నుంచి బంతి రిలీజ్ చేసే వరకు ఎక్కడా ఇబ్బంది కనిపించకుండా వరుసగా బౌలింగ్ కొనసాగించాడు.

### వైభవ్‌కు వరుసగా

వైభవ్ సూర్యవంశీ, సంజూ శాంసన్ నెట్స్‌లో బ్యాటింగ్‌కు వచ్చాక బుమ్రా వైభవ్‌కు వరుసగా బంతులు వేశారు. మొదటి నుంచే యార్కర్లు, గుడ్ లెంగ్త్ బంతులతో అతన్ని పరీక్షించాడు. వైభవ్‌కు వేసిన మొదటి బంతి యార్కర్. అది లెగ్ స్టంప్ బయటకు వెళ్లడంతో బ్యాట్ తగలలేదు. రెండో బంతిని మంచి లెంగ్త్‌లో బయటకు వెళ్లేలా వేయగా వైభవ్ పూర్తిగా బీట్ అయ్యాడు. మూడోది మళ్లీ బ్లాక్‌హోల్‌ను టార్గెట్ చేసిన యార్కర్ కాగా ఈసారి బ్యాట్ కిందకు తీసుకొచ్చి ఆపగలిగాడు. తర్వాత మరో మంచి లెంగ్త్ బంతికి వైభవ్ ఎడ్జ్ ఇచ్చాడు. మ్యాచ్‌లో అయితే వికెట్ కీపర్‌కు సులభమైన క్యాచ్ అయ్యేలా ఉన్న ఆ బంతి తర్వాత బుమ్రా వెంటనే నవ్వేశాడు. మధ్యలో ఒక ఓవర్‌పిచ్డ్ బంతిని వైభవ్ డ్రైవ్ చేశాడు.

### ఇషాన్‌కు చిన్న టెన్షన్

అదే నెట్‌లో సంజూ శాంసన్‌ను కూడా బుమ్రా యార్కర్లు, శరీరానికి దగ్గరగా వచ్చే షార్ట్ బాల్స్‌తో ఇబ్బంది పెట్టాడు. అర్ష్‌దీప్, యశ్ ఠాకూర్, దూబే, నితీశ్ కూడా వైభవ్‌కు బౌలింగ్ చేశారు. వాళ్లను ఎదుర్కొంటూ వైభవ్ కొంత ఫ్రీగా ఆడేందుకు ప్రయత్నించినా, బుమ్రా బౌలింగ్‌లో మాత్రం పెద్ద షాట్లకు వెళ్లలేదు. ఇషాన్ కిషన్ కూడా బుమ్రాను ఎక్కువగా అటాక్ చేయలేదు. తర్వాత నెట్ బౌలర్ నవదీప్ సైనీ వేసిన బౌన్సర్‌కు ఇషాన్ ఇబ్బంది పడ్డాడు. బంతి నుంచి తప్పుకునే ప్రయత్నంలో అది పై భాగంలో తగలడంతో ఫిజియోలు వచ్చి అతని వెన్ను భాగాన్ని పరిశీలించారు. శాంసన్ పేస్ నెట్స్ ముగించుకున్న తర్వాత స్పిన్నర్లను ఎదుర్కొనే నెట్‌కు వెళ్లాడు.

### రాత్రి పది వరకు ప్రాక్టీస్

మొత్తం ప్రాక్టీస్ మూడు గంటలకు పైగా సాగింది. పేసర్లు, స్పిన్నర్లు, నెట్ బౌలర్లు టాప్ ఆర్డర్ బ్యాటర్లకు వరుసగా బౌలింగ్ చేశారు. ఢిల్లీలో సాయంత్రం తేమ ఎక్కువగా ఉన్నప్పటికీ నవదీప్ సైనీ కూడా ఎక్కువసేపు బౌలింగ్ కొనసాగించాడు. సెషన్ చివరికి చాలామంది బౌలర్లు అలసిపోయే వరకు నెట్స్ నడిచాయి. అభిషేక్ శర్మ మాత్రం చివర్లో ప్యాడ్లు కట్టుకుని బ్యాటింగ్‌కు వచ్చాడు. మిగతా సెషన్ దాదాపు ముగిసిన తర్వాత కూడా అతని ప్రాక్టీస్ కొనసాగింది. రాత్రి పది గంటల సమయానికి హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, బ్యాటింగ్ కోచ్ సితాంశు కోటక్ అభిషేక్‌కు ప్రత్యేకంగా షార్ట్ బాల్ ప్రాక్టీస్ చేయించారు. పిచ్‌పై కొంచెం షార్ట్ లెంగ్త్ నుంచి బంతులు విసురుతూ వాటిని ఎలా ఎదుర్కోవాలో ప్రాక్టీస్ చేయించారు.

## తిలక్ ఏ స్థానంలో ఆడుతాడు?- భారత్‌కు టీమ్ బ్యాలెన్స్ సవాలే

# అఫ్గాన్‌తో టీ20 సిరీస్ వేళ డివిలియర్స్ కామెంట్స్

దిల్లీలో జరగబోయే తొలి టీ20లో అఫ్గాన్‌ను ఢీకొట్టనున్న భారత్- జట్టు బ్యాలెన్స్ గురించి సౌతాఫ్రికా మాజీ క్రికెటర్ కీలక వ్యాఖ్యలు

టీమ్ఇండియా వైస్ కెప్టెన్ తిలక్ వర్మ ఏ ప్లేస్‌లో బ్యాటింగ్ చేస్తాడని సందేహం



ఢిల్లీ : అఫ్గానిస్థాన్‌తో ఆదివారం నుంచి ప్రారంభం కానున్న మూడు టీ20ల సిరీస్‌కు టీమ్ఇండియా సిద్ధమైంది. ఈ క్రమంలో ఈ సిరీస్‌లో భారత జట్టు కూర్పుపై చర్చ మొదలైంది. ముఖ్యంగా టీమ్ఇండియా యంగ్ బ్యాటర్ తిలక్ వర్మ తుది జట్టులో ఉంటాడా? ఉంటే ఏ స్థానంలో బ్యాటింగ్‌కు వస్తాడు? అనే ప్రశ్నను సౌతాఫ్రికా మాజీ ప్లేయర్ ఏబీ డివిలియర్స్ లేవనెత్తాడు. తిలక్ వర్మ బ్యాటింగ్ స్థానంపై సందేహం వ్యక్తం చేశాడు. ఈ మేరకు తన యూట్యూబ్ ఛానెల్‌లో డివిలియర్స్ కీలక వ్యాఖ్యలు చేశాడు. "బ్యాటర్ల ఎంపిక విషయంలో కచ్చితంగా టీమ్ఇండియాకు కొన్ని సమస్యలు ఉంటాయి. జట్టులో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్, సంజూ శాంసన్, సూర్యవంశీ ఉన్నారు. ఆల్‌రౌండర్ల విషయానికొస్తే తిలక్ వర్మ ఉన్నాడు. ఇక్కడే జట్టు బ్యాలెన్స్ (సమతూకం) చాలా క్లిష్టంగా మారుతుందని నేను భావిస్తున్నాను. తిలక్ వర్మ ఏ స్థానంలో బ్యాటింగ్ చేస్తాడు?. అలా అని తిలక్‌ను ఎంపిక చేయడం లేదా పక్కన పెట్టడం జట్టు బ్యాలెన్స్‌పై గణనీయమైన ప్రభావం చూపుతుంది." అని డివిలియర్స్ పేర్కొన్నాడు.

### ప్రతీ ఆడగాడి రోల్‌పై క్లారిటీ ఉండాలి : డివిలియర్స్

అలాగే టీమ్ఇండియా మొత్తం స్క్వాడ్‌పై కూడా డివిలియర్స్ తన అభిప్రాయాలను పంచుకున్నాడు. ప్రమాదకరమైన అఫ్గానిస్థాన్ జట్టుతో తలపడనున్న నేపథ్యంలో భారత జట్టులోని ప్రతీ ఆటగాడి రోల్ (బాధ్యత)పై స్పష్టత ఉండాలని అభిప్రాయపడ్డాడు. ఇది చాలా కష్టతరమైన విషయమని చెప్పాడు. "అఫ్గానిస్థాన్‌తో తలపడబోయే టీమ్ఇండియా స్క్వాడ్ చాలా బలంగా ఉంది. కానీ టీమ్ బ్యాలెన్స్‌ను సాధించడం కష్టమవుతుంది. ఇది టీ20 సిరీస్ కాబట్టి టీమ్ఇండియా జట్టులో కొద్దిగా మార్పులు చేసుకునే అవకాశం ఉంది. భారత జట్టు ఆటగాళ్ల రోల్స్ వేర్వేరుగా ఉన్నప్పటికీ, అఫ్గానిస్థాన్ వంటి ప్రమాదకరమైన జట్టును ఎదుర్కోబోతున్నందుకు ప్రతీ ఆటగాడి రోల్‌పై స్పష్టత చాలా ముఖ్యం" అని డివిలియర్స్ అభిప్రాయపడ్డాడు.

### మ్యాచ్ వాయిదా అని వార్తలకు చెక్

దిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా అఫ్గానిస్థాన్‌తో టీమ్ఇండియా తొలి మ్యాచ్ ఆదివారం ఆడనుంది. అయితే సెప్టెంబరు 12, 13 తేదీల్లో దిల్లీలో బ్రిక్స్ సదస్సు కారణంగా ఈ మ్యాచ్ జరగడంపై తొలుత సందేహాలు నెలకొన్నాయి. మ్యాచ్ వాయిదా పడుతుందని వార్తలు వచ్చాయి. దిల్లీ పోలీసులు, ఉన్నతాధికారులు బ్రిక్స్ సదస్సు నిర్వహణ డ్యూటీల్లో బిజీబిజీగా ఉండడంతో, వారు భద్రత కారణాల దృష్ట్యా ఆదివారం అఫ్గాన్‌తో జరగాల్సి ఉన్న తొలి టీ20 మ్యాచ్‌ను ఇంకో తేదీకి మార్చేలా రీ షెడ్యూల్ చేసుకోవాలని దిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (డీడీసీఏ)ను కోరినట్లు మీడియాలో వార్తా కథనాలు వెలువడ్డాయి. ఈ క్రమంలో డీడీసీఏ క్లారిటీ ఇచ్చింది. దిల్లీ వేదికగానే బ్రిక్ సదస్సు కూడా జరగనున్నప్పటికీ తొలి మ్యాచ్ నిర్వహణలో ఎలాంటి మార్పు లేదని డీడీసీఏ స్పష్టం చేసింది. సిరీస్ షెడ్యూల్ ప్రకారమే ఉంటుందని వెల్లడించింది. అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా సెప్టెంబర్ 13న భారత్- అఫ్గాన్  మధ్య జరగాల్సిన తొలి టీ20 మ్యాచ్ ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే జరుగుతుందని ప్రకటించింది. దిల్లీ ట్రాఫిక్ పోలీసు అధికారులతో డీడీసీఏ సమావేశమైందని తెలిపింది. మ్యాచ్ నిర్వహణకు అవసరమైన అన్ని రకాల సహకారాలు అందిస్తామని పోలీసులు డీడీసీఏకు హామీ ఇచ్చారని పేర్కొంది. అందుకే మ్యాచ్  వాయిదా పడదని వివరించింది. ఈ మేరకు డీడీసీఏ ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది.

### మూడు మ్యాచ్‌లు ఒకే స్టేడియంలో

కాగా, సెప్టెంబర్ 13న తొలి టీ20, సెప్టెంబర్ 15 రెండో టీ20, సెప్టెంబరు 17న మూడో టీ20లో అఫ్గానిస్థాన్‌తో భారత్ తలపడనుంది. ఈ మూడు మ్యాచ్‌లు దిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలోనే జరగనున్నాయి. ఈ టీ20 సిరీస్‌కు శ్రేయస్ అయ్యర్ టీమ్ఇండియాకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యారు. అభిషేక్ శర్మ, సూర్యవంశీ, శాంసన్ , ఇషాన్ కిషన్ , శివం దూబే, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, జస్ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్, యశ్ ఠాకూర్ తదితరులు టీమ్ఇండియా స్క్వాడ్‌లో ఉన్నారు.

# నాలుగు క్యాచులు మిస్- ఫైనల్ ముందు దీప్తి రెస్పాన్స్ ఏంటంటే?

ఢిల్లీ : ఆసియా కప్‌లో భారత మహిళల జట్టు ఫైనల్‌కు చేరింది. టోర్నీలో ఇప్పటివరకు ఆడిన ప్రతి మ్యాచ్‌ను గెలిచింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో కూడా మంచి ప్రదర్శన వచ్చింది. కానీ ఫీల్డింగ్‌లో, ముఖ్యంగా క్యాచింగ్‌లో మాత్రం సమస్య కొనసాగుతోంది. విజయాలు వరుసగా వస్తున్నప్పటికీ, క్యాచులు వదిలేయడం మాత్రం ఈ టోర్నీలో భారత జట్టుకు మరోసారి ఇబ్బందిగా మారింది. ఇది ఈ టోర్నీలో ఒక్క మ్యాచ్‌కే పరిమితమైన విషయం కాదు. కొంతకాలంగా భారత మహిళల జట్టును వెంటాడుతున్న ఫీల్డింగ్ సమస్య ఇక్కడ కూడా కనిపించింది. బంగ్లాదేశ్‌తో జరిగిన సెమీఫైనల్‌లోనే భారత్ నాలుగు క్యాచులు వదిలేసింది. ఫైనల్‌కు ముందు ఇదే విషయం గురించి ఆల్‌రౌండర్ దీప్తి శర్మను అడగగా, ఇలాంటి తప్పులు ఆటలో జరుగుతుంటాయని అన్నారు. ప్రాక్టీస్‌లో జట్టు ఫీల్డింగ్‌పై చాలా పని చేస్తోందని చెప్పారు.

### నాలుగు క్యాచులు మిస్

బంగ్లాదేశ్ బ్యాటింగ్ మొదలైన తొలి ఓవర్‌లోనే భారత్‌కు మొదటి అవకాశం వచ్చింది. ప్రతీక రావల్ తలపై నుంచి వచ్చిన క్యాచ్‌ను అందుకోలేకపోయారు. తర్వాత ఆమెకు మరో క్యాచ్ వచ్చినా అది కూడా చేతుల్లో నిలవలేదు. బౌండరీ దగ్గర స్మృతి మంధాన ఒక క్యాచ్‌ను సరిగ్గా అంచనా వేయలేకపోయారు. స్క్వేర్ లెగ్ దగ్గర వచ్చిన మరో బంతి కోసం రిచా ఘోష్, నందని శర్మ ఇద్దరూ ఒకేసారి వెళ్లి తడబడ్డారు. ఆ క్యాచ్ కూడా మిస్ అయింది. ఇలా ఒకే మ్యాచ్‌లో నాలుగు అవకాశాలు చేజారినా భారత్ మాత్రం బంగ్లాదేశ్‌ను 40 పరుగుల తేడాతో ఓడించింది. సెమీఫైనల్ గెలిచిన తర్వాత మీడియాతో మాట్లాడిన దీప్తి ముందుగా ఈ ఫీల్డింగ్ తప్పులపైనే స్పందించారు.



### ప్రాక్టీస్‌లో చేస్తున్నాం

ఫీల్డింగ్ విషయంలో జట్టు ప్రాక్టీస్‌ను తగ్గించలేదని దీప్తి చెప్పారు. ప్రతి సెషన్‌లో చాలా క్యాచులు తీసుకుంటున్నామని, క్యాచింగ్‌తో పాటు మిగతా ఫీల్డింగ్ డ్రిల్స్ కూడా చేస్తున్నామని తెలిపారు. అయినా మ్యాచ్‌లో ఒక్కోసారి ఒక రోజు బాగా జరిగితే మరో రోజు కొన్ని తప్పులు రావచ్చని అన్నారు. అలాంటివి ఆటలో భాగమేనని చెప్పారు. ఫైనల్‌కు ముందు ఒక్క క్యాచ్ విషయంపైనే ఆలోచిస్తూ ఉండకుండా, బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ మూడు విభాగాల్లోనూ సిద్ధంగా ఉండాలని జట్టు చూస్తోందన్నారు. ఫైనల్‌లో పూర్తి టీమ్‌గా మంచి ప్రదర్శన ఇవ్వడమే తమ ముందున్న పని అని దీప్తి చెప్పారు.

### పాక్ లేదా శ్రీలంక

ఫైనల్‌లో భారత్‌కు పాకిస్థాన్ లేదా డిఫెండింగ్ ఛాంపియన్ శ్రీలంక ఎదురవుతుంది. ఈ రెండు జట్ల మధ్య జరిగే రెండో సెమీఫైనల్ తర్వాత ప్రత్యర్థి ఎవరో తేలుతుంది. ఆ మ్యాచ్‌ను చూసిన తర్వాతే ఫైనల్ కోసం ప్లాన్ చేస్తామని దీప్తి చెప్పారు. శుక్రవారం జట్టు సభ్యులు కలిసి కూర్చొని ప్రత్యర్థికి తగ్గ స్ట్రాటజీపై పని చేస్తామని తెలిపారు. ఫైనల్‌లో ఎవరు రావాలని కోరుకుంటున్నారు అని అడిగినప్పుడు, అది వారి మ్యాచ్ ఫలితంపై ఆధారపడి ఉంటుందని సమాధానమిచ్చారు. శ్రీలంక వచ్చినా, పాకిస్థాన్ వచ్చినా తాము ఎవరినీ తేలికగా తీసుకోమని స్పష్టం చేశారు. ఏ జట్టు వచ్చినా తమ ఆటను ఎలా మెరుగుపరుచుకోవాలి, టీమ్‌గా ఎలా బాగా ఆడాలి అన్నదే ముందు చూస్తామని చెప్పారు.

### దీప్తి ఆల్‌రౌండ్ షో

సెమీఫైనల్‌లో దీప్తి తన ఆటతో కూడా కీలక పాత్ర పోషించారు. బ్యాటింగ్‌లో ఆమెకు ఎక్కువ బంతులు దొరకలేదు. అయినా ఆరు బంతుల్లో 13 పరుగులు చేశారు. తర్వాత బౌలింగ్‌లో 26 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు తీసుకున్నారు. బ్యాటింగ్‌కు అవకాశం వచ్చిన ప్రతిసారి పరుగులు చేయగలననే నమ్మకం తనకు ఉంటుందని దీప్తి చెప్పారు. కొన్ని బంతులే వచ్చినా వాటిని ఉపయోగించుకోవడం తనకు కాన్ఫిడెన్స్ ఇస్తుందని తెలిపారు.

### ఏదైనా రెడీ

ముందు బ్యాటింగ్ చేయాలా, ముందు బౌలింగ్ చేయాలా అన్నది తనకు పెద్ద విషయం కాదని దీప్తి అన్నారు. జట్టుకు ఏ సమయంలో ఏం అవసరమైతే ఆ పని చేయడానికి సిద్ధంగా ఉంటానని చెప్పారు. బ్యాటింగ్ చేసే అవకాశం వస్తే పరుగులు చేయడం, బౌలింగ్ ఇస్తే వికెట్లు తీసేందుకు ప్రయత్నించడం తన బాధ్యతగా చూస్తానన్నారు. ఆల్‌రౌండర్‌గా రెండు విధాలుగా జట్టుకు ఉపయోగపడాలనే ఆలోచనతోనే ఉంటానని తెలిపారు. మ్యాచ్‌లో తనకు ఏ పని ముందుగా వస్తుందన్నది పట్టించుకోనని, అవకాశం వచ్చినప్పుడు దాన్ని ఉపయోగించుకోవడంపైనే దృష్టి పెడతానని చెప్పారు. బంగ్లాదేశ్‌పై వచ్చిన ఆరు బంతుల బ్యాటింగ్ అవకాశం కూడా తనకు కాన్ఫిడెన్స్ ఇచ్చిందని దీప్తి అన్నారు. అలాంటి అవకాశాలను ఎప్పుడూ ఉపయోగించుకోవాలని చూస్తానన్నారు.

Printed , Published and Owned by POLAGONI ALIVELU, and Printed at Smilys Online, 6-7-48, Vanasthalipuram, Shopping Complex, Rangareddy-500070. Telangana State and Published from 17-10-25, Plot No.H.No. 4-136/12, Turkayamjal Journalist Colony, Rangareddy501510, Telangana State. Editor: POLAGONI ALIVELU. PRGI No. TGTEL/25/A3190. Phone No: +91 7989151815